B.K. YADAV FOUNDATION
ONE PERSON CAN MAKE DIFFERENCE

# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

ఆదివారం,
ఆగస్టు 31, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

# 50% సీలింగ్ ఎత్తివేత!

## పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లులు ఆమోదించిన మంత్రివర్గం



**2 బిల్లులు శాసనసభలో ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపాలని నిర్ణయం**

**బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనకు వీలుగా బిల్లులు రూపొందించిన సర్కారు**

**బీసీలకు 42% రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు**

**గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్**

**వరద నష్టంపై నేడు జిల్లా కలెక్టర్లు, మంత్రులతో సీఎం సమీక్ష**

**కేబినెట్ భేటీ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు పొన్నం, పొంగులేటి**

హైదరాబాద్: రిజర్వేషన్లపై 50% గరిష్ట పరిమితి ఎత్తివేసి పంచాయతీరాజ్, పురపాలక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వే షన్లు కల్పించేందుకు వీలుగా రూపొందించిన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లులను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్ర శాసనసభలో ఈ రెండు బిల్లులను ఆమోదించి రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం పంపాలని నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం శాసనసభ కమిటీ హాల్లో సమావేశమైన కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతరం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

**బీసీ కోటా పెంపునకు అడ్డంకిగా**

నాటి బిల్లులు: బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు కల్పించేందుకు గత మార్చిలో శాసనసభలో రెండు బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపించగా, ఆయన ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించడంతో ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. రిజర్వేషన్లపై 50% సీలింగ్ విధిస్తూ 2018లో పంచాయతీరాజ్ చట్టానికి, 2019లో మున్సిపల్ చట్టానికి నాటి సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన సవరణ బిల్లులు బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డంకిగా మారాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లపై 50% సీలింగ్ ఎత్తివేసేందుకు గత మంత్రివర్గ సమావేశంలో ఆర్డినెన్స్‌లను ఆమోదించి గవర్నర్‌కు పంపించగా, ఆయన వాటిని సైతం ఆమోదించకుండా రాష్ట్రపతికి సిఫారసు చేశారని చెప్పారు. మరోవైపు పంచాయతీరాజ్ ఎన్నికలను సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలంటూ హైకోర్టు గడువు విధించిందని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో బీసీ రిజర్వేషన్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం ఇటీవల న్యాయ నిపుణులతో చర్చించిందని తెలిపారు. తాజాగా బీసీలకు 42% రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించిందని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిందన్నారు. 50% సీలింగ్ ఎత్తివేసేందుకు వీలుగా ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టనున్న రెండు బిల్లుల ఆమోదానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్**

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్‌ల పేర్లను ప్రతిపాదించాలని మంత్రివర్గం



# ప్రజాస్వామ్య పరిరక్షణకు కలిసి సాగుదాం

**కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారం గుప్పిట పట్టుకోవడానికి కుయుక్తులు**

**లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఏకమై తిప్పికొట్టాలి**

**సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్: అధికారం కన్నా విపక్షంగా ఉంటూనే ప్రజా సమస్యలపై పోరాటాలకు కమ్యూనిస్టులు ఆసక్తి కనబరుస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మొన్నటి అధికార బదలాయింపులో కమ్యూనిస్టుల సహకారం ఎంతో ఉందని ఆయనన్నారు. శనివారం రవీంద్రభారతిలో సిపిఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు నేత సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు పాల్గొని రెండు మౌనం పాటించారు. అనంతరం సురవరం సుధాకర్ రెడ్డికి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి



**కేబినెట్ కీలక నిర్ణయం.. కోదండరామ్, అజారుద్దీన్‌లకు గుడ్‌న్యూస్**



**బిహార్ సీఎం అభ్యర్థిని నేనే**

రాహుల్ సమక్షంలోనే తేజస్వి వ్యాఖ్యలు



**ఆర్థిక ఇబ్బందులతో ప్రాణం తీసుకోవాలనుకున్న దంపతులు**

::: భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు

## యూరియా కొరత

# తక్షణమే తీర్చాలి

**సచివాలయం వద్ద బిఆర్ఎస్ మెరుపు ధర్నా**

**అసెంబ్లీ సమావేశాల తొలిరోజు బీఆర్ఎస్ నిరసన**

**గన్‌పార్కు వద్ద యూరియా సంచులు, ప్లకార్డుల ప్రదర్శన**

**వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ధర్నా**

**సచివాలయం ఎదుట బైఠాయింపునకు యత్నం**

**అదుపులోకి తీసుకుని తెలంగాణ భవన్‌కు తరలించిన పోలీసులు**



హైదరాబాద్ : యూరియా కొరత తక్షణమే తీర్చాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు సచివాలయం ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. ప్రధాన గేటు వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు సరిపడా యూరియాను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం కెటిఆర్, హరీష్‌రావు నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అసెంబ్లీ నుంచి వ్యవసాయ కమిషన్ వద్దకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లారు. కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చి కమిషనర్ కార్యాలయం ఎదుట వారు ధర్నాకు దిగారు. అక్కడ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తరలించారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ ఎంఎల్ఎలు,




# చైనాకు చేరుకున్న ప్రధాని మోడీ

## నేడు జిన్‌పింగ్‌తో కీలక భేటీ

తియాంజిన్ (చైనా) : జపాన్ పర్యటన ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోడీ శనివారం రాత్రి చైనాకు చేరుకున్నారు. ఆదివారం నుంచి రెండురోజుల పాటు ఇక్కడి తియాంజిన్‌లో జరిగే చైనా ప్రతిష్టాత్మక షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) వార్షిక సదస్సులో పాల్గొనడమే ప్రధాని మోడీ పర్యటన ప్రధాన ఉద్దేశం. అయితే ఈ నేపథ్యంలోనే చైనా అధినేత జి జింపింగ్‌తో ప్రత్యేకంగా సమావేశం కావడం, అమెరికా టారీఫ్‌లు, మార్కెట్ల ఒడుదుడుకుల క్రమంపై చర్చలు జరపడం, సమీక్షించుకోవడం భారత్‌కు అత్యంత ప్రధాన విషయం అయింది. ఆదివారం, సోమవారం షాంఘై సదస్సు జరుగుతుంది. ఇక్కడికి రష్యా అధినేత పుతిన్ రావడం కూడా కీలకం అయింది. ప్రత్యేకించి ఆదివారం చైనా అధ్యక్షులు జిన్‌పింగ్‌తో ప్రధాని భేటీకి రంగం సిద్ధం అయింది. ఈ రోజే షాంఘై సదస్సు విస్తృత స్థాయి సంప్రదింపులు కూడా జరుగుతాయి. 2020లో లద్దాఖ్‌లో భారత్ చైనా సైనికుల ఘర్షణలు, సంబంధాల మధ్య ప్రతిష్టంభన క్రమేపీ సమసిపోవడం జరిగింది. ఏడేళ్ల తరువాత ప్రధాని మోడీ ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. జపాన్‌లోనే అక్కడి ప్రధాన పత్రికకు ప్రధాని మోడీ శుక్రవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత్ చైనా పటిష్ట బంధం అత్యవసరం అని, ఈ ప్రాంతం, పరస్పరమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ వ్యాప్తంగా కూడా ఈ పటిష్ట బంధం మైలురాయి అవుతుందని తెలిపారు. చైనా

# అసెంబ్లీ నేడు ఒక్కరోజే

## వర్షాకాల సమావేశాలు నేటితో ముగించాలని నిర్ణయం

**బీఏసీ సమావేశంలో ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం**

**ఆదివారం సభ ముందుకు 'కాళేశ్వరం'పై పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు.. చర్చ**

**ఆ తర్వాత స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేతకు సంబంధించిన బిల్లులు**

**15 రోజుల పాటు చర్చించాలని బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ప్రతిపాదన**

**ప్రభుత్వం అంగీకరించకపోవడంతో బీఆర్ఎస్ వాకౌట్**



హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు రెండోరోజు ఆదివారంతోనే ముగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. పలు జిల్లాల్లో వర్ష బీభత్సం, గణేశ్ నిమజ్జనం తదితరాల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అవసరమైతే కొద్ది విరామం తర్వాత మళ్లీ సమావేశాలు నిర్వహించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు శనివారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) భేటీలో ప్రభుత్వం ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ, ఎంఐఎం పార్టీలు కూడా కనీసం 15 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని కోరినట్లు తెలిసింది. ఆ ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకరించక పోవడంతో భేటీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీసీ ఘోష్ కమిషన్ పూర్తి నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు సమర్పిస్తారు. దీనిపై చర్చ అనంతరం పంచాయతీరాజ్,



## విఘ్నేశ్వర స్వామి కి పూజలు చేస్తున్న ఇన్స్పెక్టర్ మన్మధకుమార్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 30 : చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులో శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రక్కన శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ఏర్పాటుచేసిన శ్రీ వినాయక స్వామికి శనివారం చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ జి మన్మధ కుమార్, ఎస్సై యాదగిరి గౌడ్, సీనియర్ పాత్రికేయులు దోనూరు రాంరెడ్డి లు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతుని పట్ల ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.



### పారిశుద్ధ కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని

## ప్రారంభించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 30 చౌటుప్పల పట్టణ కేంద్రంలోని లక్కారం జయశ్రీ ఫంక్షన్ హాల్ లో శనివారం రోజున మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాం రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ ఆర్ కె హాస్పిటల్ & కామినేని హాస్పిటల్ చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. తనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చౌటుప్పల్ పట్టణ ప్రజలను కంటికి రెప్పల కాపాడుతూ పట్టణాన్ని శుభ్రపరచడంలో ముఖ్యపాత్ర పోషించి వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్నటువంటి కార్మికులకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం మొట్టమొదటిసారిగా చూస్తున్నాను అని అన్నారు.మున్సిపల్ కార్మికులు బాగుంటేనే పట్టణ ప్రజలు బాగుంటారు. వారికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినటువంటి మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాం రెడ్డి నీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అభినందించారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా సాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన డాక్టర్స్ బృందం నీ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాం రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఎమ్మార్వో వీర బాయ్, మున్సిపల్ అధికారులు, ఆర్.పి లు పాల్గొన్నారు



### ఎంపీడీఓ కు వినతి పత్రం అందజేసిన

## బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్

వార్త మిర్రర్ చౌటుప్పల్,ప్రతినిధి ఆగస్టు 30 : చౌటుప్పల్ మండలంలోని వివిధ గ్రామాల్లోని ఓటర్ల జాబితా, వార్డుల వారిగా విభజన సరైన పద్ధతిలో జరగలేదని తెలుపుతూ ఎంపీడీఓ సందీప్ కుమార్‌కు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్ శనివారం వినతిపత్రం అందజేశారు. తనంతరం మాట్లాడుతూ విభజన ప్రతిపాదిక తెలుపాలని కోరారు. దీని పై స్పష్టత లేనందున మరోసారి విశ్లేషించి జాబితాను రూపొందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అల్మాస్‌పేట కృష్ణ, ఉపాధ్యక్షుడు చిన్నం బాలరాజు, మున్సిపాలిటీ యూత్ అధ్యక్షుడు తూర్పునూరి నరసింహ గౌడ్, నాయకుడు ఆరుట్ల లింగస్వామి పాల్గొన్నారు.

## మట్టి వినాయకుని పూజిద్దాం

## పర్యావరణాన్ని కాపాడుదాం.. దబ్బటి శేఖర్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 30: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో వినాయకుని నెలకొల్పాను సంగెం దగ్గర భీమలింగం లో మట్టి వినాయకుడికి నిమర్జనం చేశాను. ఈ సందర్భంగా మాట్లాడుతూ మట్టి వినాయకుడిని పూజించడం వల్ల మనకు ఎంతో పర్యావరణానికి హాని కలగకుండా ఉంటుంది కావున ప్రతి ఒక్కరు మట్టి వినాయకు లను పూజించాలని తెలియజేస్తున్నాం ఈ కార్యక్రమంలో సందీప్ తదితరుల పాల్గొన్నారు..





## కాప్రా ప్రెస్ క్లబ్‌లో వినాయక చవితి వేడుకలు

### పూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు,నాయకులు

కాప్రా,వార్త మిర్రర్,ఆగస్టు30:కాప్రా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో శనివారం వినాయక చవితి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,ఉన్నత అధికారులు,రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు.ఉప్పల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ వంటి ప్రజా వేదికల్లో ఇలాంటి ఆధ్యాత్మిక,సాంస్కృతిక కార్యక్రమాలు జరగడం హర్షదాయకమన్నారు.వినాయకుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితం సుఖసంతోషాలతో నిండిపోవాలి అని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా బీజేపీ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షుడు సంధ్యా నరసింహారెడ్డి,డి.ఎల్ రావు,నాయకులు హెచ్‌బి కాలనీ అధ్యక్షుడు రామ్ ప్రదీప్,లక్ష్మణ్ గౌడ్,నాదం, భాగ్యనగర్ గణేష్ సమితి నాయకులు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# తాజ్‌పూర్‌లో ఆది దేవుడు మహాగణపతి నిమజ్జనం యాత్ర

### ప్రత్యేక పూజలో పాల్గొన్న సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదిదేవుడు మహాగణపతి నిమజ్జనం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పహనం లో భారీ ఊరేగింపుగా ఆటపాటలతో సందడి చేశారు నృత్యాల మధ్య గణనాథుడు గంగమ్మ గుడికి చేర్చారు ఈ కార్యక్రమంలో ఎస్ కే యాకుబ్, పండుగ కిరణ్, ఉదత రాజు, గంజి సందీప్, నరసింహ, పల్లెపాటి కృష్ణ, బిట్కూరి లక్ష్మణ్, తోట గోవర్ధన్, బొమ్మారపు బాలరాజు, ఎస్.కె బషీర్ మరియు గ్రామ పెద్దలు యూత్ సభ్యులు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు

# తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత వారసులదే.

### ఉమ్మడి కుటుంబ వ్యవస్థే వృద్ధులకు రక్షణ న్యాయ సాయం

### న్యాయ సహాయం కోసం సేవా కేంద్రం ఏర్పాటు

### సీనియర్ సివిల్ జడ్జ్ వెంకట మల్లిక్ సుబ్రహ్మాణ్య శర్మ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 30 : తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత వారి వారసులే తీసుకోవాలని జగిత్యాల జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జ్ వెంకట మల్లిక్ సుబ్రహ్మాణ్య శర్మ అన్నారు. జగిత్యాల జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని నివేదిత వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధాశ్రమాల్లో వయోవృద్ధుల న్యాయ సేవా కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ప్రభుత్వ చట్టాలపై, వయోవృద్ధుల సంరక్షణ పథకాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. వృద్ధాశ్రమంలోని మౌలిక వసతులను పరిశీలించి సలహాలు అందించి వృద్ధుల సమస్యలను అడిగి తెలుసుకొని పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సివిల్ లా ప్రకారం నిరస్రాయులైన మీకు ఆశ్రయం కల్పించేందుకు న్యాయ సలహాలు అందించేందుకు అనాధాశ్రమంలో వృద్ధుల న్యాయ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. వారానికి ఒకసారి లాయర్లు వృద్ధాశ్రమాన్ని సందర్శిస్తారని తమ సమస్యలు వివరిస్తే మీ తరపున న్యాయపోరాటం చేస్తారని తెలిపారు. మీ సమస్యలకు వారధిగా అడ్వకేట్ ను కేటాయించామని సంబంధిత న్యాయవాదికి సమస్యలను తెలుపాలన్నారు. తల్లిదండ్రులను పోషించే బాధ్యత పిల్లలదే అని, బాధ్యతను నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకోవడం పిల్లల యొక్క నైతిక, చట్టపరమైన బాధ్యత అని న్యాయస్థానాలు, ప్రభుత్వ అధికారులకు మీ సమస్యలను తెలుపాలన్నారు. తల్లిదండ్రులకు ఆస్తులున్నా లేకున్నా పిల్లలే వారిని పోషించాలని, ఆస్తులను పిల్లలకు రాయడం తప్పేనని పేర్కొన్నారు. తల్లిదండ్రులను



పట్టించుకోని పిల్లలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు, అవసరమైతే జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉందని తెలిపారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థే వృద్ధులకు రక్షణ అని పెద్దలను వృద్ధాశ్రమాల్లో చేర్పించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వయోవృద్ధుల సంరక్షణ చట్టాలున్నాయని తల్లిదండ్రుల పేరట ఉన్న ఆస్తిని వారసులు తీసుకొని సంరక్షణలో నిర్లక్ష్యం చేస్తే స్థానిక తహసిల్దార్, ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తే సంరక్షణ ఖర్చులతో పాటు వారసుల వద్ద నుండి ఆస్తిని తిరిగి తీసుకునే హక్కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ తరగతి న్యాయమూర్తులు గంప కరుణాకర్, ఏజిపి ఓం ప్రకాష్, లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ చంద్ర మోహన్, పి.సతీష్, విజయ్ కృష్ణ, ఏ పి పి బిట్ల నర్సయ్య, ప్యానల్ అడ్వకేట్ గోనె భూమేశ్వర్, పారిపెల్లి లక్ష్మీనారాయణ, పిఎల్ వి గంగరాజాం, తదితరులు పాల్గొన్నారు.



## కాప్రా ప్రెస్ క్లబ్ పూజలో పాల్గొన్న కార్పొరేటర్ ప్రభుదాస్

కాప్రా,వార్త మిర్రర్,ఆగస్టు30:ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవంలో భాగంగా శనివారం జరిగిన పూజ కార్యక్రమంలో హెచ్.బి కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ పాల్గొన్నారు.ప్రెస్ క్లబ్ అనేది ప్రజా సమస్యలను ఎత్తిచూపే ఒక ముఖ్యమైన వేదిక.జర్నలిస్టులు సమాజంలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళు న్నారు.ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు జర్నలిస్టుల ఐక్యతను పెంపొందిస్తాయి. వినాయకుని ఆశీస్సులతో ప్రజలకు శ్రేయోభిలాష కలగాలి అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులు ఏంపల్లి పద్మారెడ్డి,బేలిదే అశోక్,గుమ్మడి హరి ప్రసాద్,పటేల్ నర్సింహులు, దొమ్మాటి కిరణ్ కుమార్,యాటరాజు,ముత్యం ముఖేష్,రామచంద్ర మూర్తి,డి. శ్రీనివాస రావు,గంగి కృష్ణ,ఓ.నర్సింహ,మమత రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, నిరంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఐక్యత,సామరస్యానికి వినాయక చవితి ఉత్సవాలు దోహదం

### - ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా ప్రెస్ క్లబ్ లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు కాప్రా,వార్త మిర్రర్,ఆగస్టు 30:కాప్రా ప్రెస్ క్లబ్ వినాయక మండపంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుని ఆశీస్సులు అందరికీ కలగాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా విలేకరులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూవినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని,విద్య,విజయాలకు ప్రతీక అన్నారు.జర్నలిస్టులు సమాజానికి అద్దం లాంటివారని,ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా ప్రతిబింబిస్తూ,ప్రజాస్వామ్య బలప రుస్తూ ముందుకు సాగుతున్న కృషి అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్.పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ రామారావు,కాసం మహిపాల్ రెడ్డి, కుమారస్వామి,ప్రెస్ క్లబ్ సభ్యులు ఏంపల్లిపద్మారెడ్డి,పటేల్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



## కాప్రా ప్రెస్ క్లబ్‌లో పూజలు నిర్వహించిన డిసిపి పద్మజ

కాప్రా,వార్త మిర్రర్,ఆగస్టు30:రాచకొండ కమిషనరేట్ మల్కాజిగిరి డీసీపీ పి.వి పద్మజ కాప్రా ప్రెస్ బబ్లు ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డిసిపి మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అనేది సమాజానికి మార్గదర్శక వేదిక.జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి ప్రభుత్వానికి చేరవేస్తున్నారు. వారు అందించే సమాచారం సమాజ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది.వినాయక చవితి వంటి పండుగలు ఐక్యతను పెంచుతాయి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఎస్హెచ్ఓ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాప్రా ప్రెస్ క్లబ్‌లో ఘనంగా వినాయక చవితి

కాప్రా,వార్త మిర్రర్,ఆగస్టు30:కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందమల్ల పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలో పాల్గొని మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ వంటి వేదికలు సామాజిక,సాంస్కృతిక ఐక్యతకు నిలయాలు.ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సత్సంకల్పాలను పెంపొందించడమే కాకుండా మన అందరినీ ఒకచోట కలుపుతాయి. వినాయకుని కృపతో ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు శ్రేయోభిలాష కలగాలి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సీతారాం రెడ్డి,కొత్త అంజిరెడ్డి,ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి (గడ్డం) ప్రసాద్,పెద్ది శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## బాలాపూర్ మహా గణనాథుడి సేవలో కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి

### తెలంగాణ బిజెపి చీఫ్ ఎన్ రామచందర్ రావు, శ్రీరాములు అందెల

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 29 .. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ గ్రామం లోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మహా గణనాథుడిని శనివారం కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి తెలంగాణ బిజెపి అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్ రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి ఉత్సవ సమితి సభ్యులతో కలిసి వారిని ఘనంగా సత్కరించి బొజ్జ గణపయ్య మహా ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ ఆ మహా గణనాథుడి ఆశీస్సులు దేశ ప్రజలందరిపై ఉండాలని, ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి మరింత శక్తిని ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలన్ శంకర్ రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి ఆలే భాస్కర్, యువ మోర్చా జాతీయ నాయకులు బద్దం మహిపాల్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు, బడంగ్ పెట్ కార్పొరేషన్, మీర్ పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు మరియు హిందూ సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## తుర్కపల్లి మండలం లంబాడి హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షునికి ఘన సన్మానం

### – గిరిజన సమస్యల పరిష్కారానికై నిత్యం ప్రజల్లోనే ఉంటా.... మాలోతు రమేష్ నాయక్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం బీల్య నాయక్ తండ కు చెందిన మాలోత్ రమేష్ నాయక్ ను మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు తుర్కపల్లి మండల గిరిజన నాయకులు ఘనంగా సన్మానించడం జరిగిందినూతన అధ్యక్షుడు మలోతు రమేష్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు మండల గిరిజన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఎటువంటి గిరిజన సమస్యలు ఉన్న పోరాటానికి ముందుంటానని గిరిజన జాతి గురించి పాటుపడతానని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల గిరిజన నాయకులు నునావతు లచ్చు నాయక్, గూగులోత్ భాస్కర్ నాయక్, మలోతూ సుధాకర్ నాయక్, గుగులోతు నరేందర్ నాయక్, గుగులోతూ బన్ని నాయక్ , శ్రీను నాయక్ ఇస్మాయిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు




## జిల్లా కోర్టు భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

### నిర్మాణ పనులను పరిశీలించిన

### ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) బృందం

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : భువనగిరి జిల్లా కోర్టు భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్( ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి కోరారు. జిల్లా కోర్టు నిర్మాణపు పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ నూతనంగా నిర్మాణం అవుతున్న జిల్లా కోర్టు భవనం ప్రక్కన అడ్వకేట్లకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆయన కోరారు. జిల్లాలోని రామన్నపేట చౌటుప్పల్ ఆలేరు కోర్టు భవనాలు లేక న్యాయవాదులు మరియు క్లైంట్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రామన్నపేట ఆలేరు చౌటుప్పల్ కోర్టుల నిర్మాణాలను కూడా చేపట్టాలని వారు కోరారు యాదగిరిగుట్ట కోర్టుకు స్థలాన్ని మంజూరు చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షుడు బొల్లెపల్లి కుమార్, కోశాధికారి బొడ్డు కిషన్, జిల్లా కమిటీ సభ్యులు ఎరుకలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# భువనగిరి మండల వ్యాప్తంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలి

### భూ పంపిణీ నిషేధాన్ని ఎత్తివేసి పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలి

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : భువనగిరి మండల వ్యాప్తంగా ఉన్న లింకు రోడ్లు, కాలువల పైన బ్రిడ్జిలు, మురికి కాలువలు, వీధిలైట్లు లాంటి ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగిరెడ్డిపల్లి నందనం గ్రామాల మధ్యన జాతీయ రహదారిపై హై లెవెల్ బ్రిడ్జిని నిర్మాణం చేపట్టాలని, మండలంలో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధం ఎత్తివేసి పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. శనివారం సిపిఎం భువనగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు మండల వ్యాప్తంగా గ్రామాలలో పేరుకపోయినా ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ వాగ్దానాలను అమలు చేయాలని ధర్నా నిర్వహించిన అనంతరం వివిధ గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ తహశీల్దార్ గారికి మెమోరం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ బస్వాపురం ప్రాజెక్టుకు రూ.500 కోట్లు కేటాయించి తక్షణం పూర్తి చేసి అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలని అన్నారు. మండలంలోని అనాజిపురం, హన్మాపురం, చీమల కొండూరు, ముస్తాలపల్లి, బస్వాపురం గ్రామాలకు సంబంధించిన లింకు రోడ్ల సమస్యను పరిష్కరించాలని అన్నారు. అనాజిపురం జంపల్లి మధ్యన ఉన్న చిన్నేరు వాగు పైన, బస్వాపురంలోని ఉసిల్ల వాగు పైన, ముత్తిరెడ్డిగూడెం లోని బస్వాపురం కాళేశ్వరం కాలువ పైన బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇంకా గ్రామాలలో ఇల్లు లేని పేదలు పెద్ద ఎత్తున ఉన్నారని వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను రాజకీయాల కతీతంగా ఇవ్వాలని సూచించారు. బస్వాపురం ప్రాజెక్టు ద్వారా వివిధ గ్రామాల మధ్య నుండి వెళ్తున్న కాల్వకు తూములు ఏర్పాటు చేసి అన్ని గ్రామాల చెరువులను నింపాలని అన్నారు. ముస్తాలపల్లి గ్రామంలో ఇళ్లపై నుండి ఉన్న విద్యుత్తు లైన్లను తొలగించాలని, ఇంకా గ్రామాలలో పెన్షన్లు రానివారికి, రేషన్ కార్డులు వారికి వెంటనే ఇవ్వాలని, ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు. స్థానిక తహసిల్దార్ సమస్యలపై ఇచ్చిన దరఖాస్తు ఆధారంగా రాజకీయ పార్టీలకు సమావేశాలు జరిపి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలను, ఆందోళనను ఉధృతం చేస్తామని నర్సింహ హెచ్చరించారు.ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఎదునూరి మల్లేశం, కొండ అశోక్, మండల కమిటీ సభ్యులు పాండాల మైసయ్య, మోట ఎల్లయ్య, కొండాపురం యాదగిరి, అబ్దుల్లాపురం వెంకటేష్, మధ్యపురం బాల్ నర్సింహ, మండల నాయకులు వడ్డెబోయిన వెంకటేష్, మచ్చ భాస్కర్, ఎదునూరి వెంకటేష్, బండి శ్రీను, బొల్లెపల్లి స్వామి తోపాటు శ్రీను, మల్లేష్, ఐలయ్య, క్రాంతి, గణేష్, అంజమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు



## మృతి చెందిన గుర్రం మన్నెమ్మ కుటుంబానికి అంత్యక్రియలకు ఆర్థిక చేయూత

### మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్ 10,000/ వేల రూపాయలు

### స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ 5000/ వేల రూపాయల ఆర్థిక సహాయం

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో చేనేత కుటుంబానికి చెందిన గుర్రం మనెమ్మ మృతి చెందడంతో నిరుపేద చేనేత కుటుంబం కావడంతో మృతురాలి అంత్యక్రియల కోసం తక్షణ సహాయం కింద మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్ 10,000/ వేల రూపాయలు, స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ 5000/వేల రూపాయలను నారాయణపురం గ్రామ బిఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా మృతి చెందిన గుర్రం మనెమ్మ కుటుంబానికి అందజేశారు, ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ బిక్షం,బిఆర్ఎస్ నాయకులు రాసాల వెంకటేష్ సాగర్, రాపర్తి కరుణాకర్ గౌడ్, పాశం కృష్ణ యాదవ్, గుండమల్ల సతీష్, ఉప్పల ఆంజనేయులు, చిలువేరు ముత్యాలు, చిలువేరు శంకర్, చిలువేరు శ్రీనివాస్, పేరా రమేష్, సుర్వి వెంకటేష్ గౌడ్, చిలువేరు జంగయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## వైదేహి నగర్ నార్త్ కాలనీలో గణనాధుని వద్ద ఘనంగా అన్నదాన వితరణ కార్యక్రమం



ఎల్బీనగర్, 30 ఆగస్టు :బి ఎన్ రెడ్డి డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ నార్త్ కాలనీలో రోడ్ నెంబర్ 12 పార్కులో వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మి రాఘవేంద్ర, పోగుల రాంబాబు కుటుంబం ప్రోత్సాహంతో శనివారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పోగుల రాంబాబు మాట్లాడుతూ వారి అసోసియేషన్ తరపున జరుపుతున్న గణేష్ ఉత్సవాలలో భాగంగా శనివారం జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో దాదాపు 800 మంది కాలనీ. వాసులు, భక్తులు, పారిశుద్ధ కార్మికులు జలమండలి సిబ్బంది పాల్గొని ఆ గణనాథుని ఆశీస్సులు పొందారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు కటిక రెడ్డి అరవింద్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు రాజేందర్ రెడ్డి , నాగరాజా, ప్రసాదు, ప్రభాకర్ రావు, నాగేశ్వరరావు, మాధవరావు, ఈ. రారెడ్డి, కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాదం వడ్డించిన అసోసియేషన్ సభ్యులకు, కాలనీవాసులకు మహిళా మూర్తులకు, పోగుల రాంబాబు వారి అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలిపారు.



## స్ఫూర్తి మహిళా డిగ్రీ కళాశాలలో భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం వేడుక

### ఆట పాటలతో నృత్యాలు చేస్తూ గంగమ్మ ఒడికి తరలిన గణనాథుడు

రామంతపూర్ వార్త మిర్రర్ ప్రతినిధి : రామంతపూర్ లోని స్ఫూర్తి మహిళ డిగ్రీ కళాశాలలో వినాయక నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. శనివారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ మాట్లాడుతూ గణేషుడు కర్తవ్య, నిర్వహణ దీక్షుడు, గణపతిని భక్తిశ్రద్ధలతో వేడుకుంటే విద్యా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు, అనంతరం స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి వాహనం లోభారీ ఊరేగింపుగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు నృత్యాల మధ్య గణనాథుడు గంగమ్మ ఒడిని చేర్చారు కళాశాల యజమాన్యం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అబ్బాస్ రోషన్, సంపత్ ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు

## మురికి కాలువ నిర్మాణం పట్టించుకునే నాథుడే లేకపోయే

### పట్టించుకోని ప్రభుత్వ అధికారులు

### ప్రజా ప్రతినిధులు లేక గ్రామాలు విలవిల



సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 30 ( వార్త మిర్రర్ ):

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కొత్తగూడెం గ్రామ పంచాయతీ పరిధి లోని ప్రధాన రహదారి ప్రక్కన అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో మురుగునీరు ప్రవహిస్తూ ఉంటుంది. మురికి కాలువ గ్రామ ఆవాసాల గుండా ఆంజనేయ స్వామి ఆలయం నుండి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు సుమారు 800 మీటర్ల వరకు ఉంటుంది అని .గతంలో ఎన్నో మార్లు రాజకీయ నాయకుల దృష్టికి ప్రభుత్వ అధికారుల దృష్టికి వెళ్లడం జరిగింది.అని స్థానికులు తెలిపారు. అయినా మురికి కాలువకు మోక్షం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు.ఈ మురికి కాలువ వలన దోమలు దుర్వాసనకు చుట్టుపక్కల నివాసం ఉంటున్న ప్రజలకు ప్రాథమిక పాఠశాలలో, అంగన్ వాడి కేంద్రం లో చదివే చిన్న పిల్లలకు విషజ్వరాలు వస్తున్నాయి అని గ్రామస్తులు ఆరోపిస్తున్నరు.అధికారులను నిర్మించమని అడిగితే అన్ని నిధులు లేవు అని అంటున్నారు. స్థానికంగా సర్పంచి లేకపోవడంతో గ్రామంలో ఎవరిని అడగాలో తెలియక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపారు.ప్రస్తుతం జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిచిన అభ్యర్థి అయిన ఈ మురికి కాలువ నిర్మిస్తారు అని స్థానికులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

## విఘ్నేశ్వరుడి విగ్రహా దాత ముచర్ల జనార్ధన్ రెడ్డి



కల్వకుర్తి ఆగస్టు 30 వార్త మిర్రర్ ప్రతినిధి:–ఊర్కొండ మండలం ముచ్చర్ల పల్లి గ్రామంలో ఎస్సీ కమిటీ హాల్,వివేకానంద యువజన సంఘం దగ్గర ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్సీ కమిటీ అధ్యక్షులు కొండం సురేష్ మాట్లాడుతూ మా ఎస్సీ కమిటీ హాల్,వినాయక భక్త బృందానికి గత 25 సంవత్సరాల నుండి విగ్రహాన్ని ఇప్పిస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డికి కొండం సురేష్ భక్త బృందం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా భక్త బృందం గణపయ్య పూజలో ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఆర్థిక, రాజకీయంగా ఎదగాలని, ఆ దేవుడిని కరుణాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని కోరారు.



## క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలన పై పాఠశాల విద్యార్థులకు అవగాహన

మిర్యాలగూడ, ఆగస్టు 30:–( వార్త మిర్రర్) టీబీ ముక్త్ అభియాన్ లో భాగంగా అవంతీపురం గురుకుల పాఠశాలలో క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలన, తీవ్రత, ఎటువంటి లక్షణాలను కలిగి ఉంటుందని వస్తే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని మిర్యాలగూడ మండలం అవంతిపురం గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన అలగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మొయీద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రఫీ కల్పించారు. వ్యాధి నిర్ములన గురించి తీసుకో వాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఇ శ్యాంసుందర్ రెడ్డీ, సూపర్ వైజర్ మంగమ్మ, ఎంఎల్హెచ్పి శిరీష, హెచ్ఇ సత్యనారాయణ,ఎస్టిఎల్ఎస్ నాగిరెడ్డి , ఎఎన్ఎం ప్రేమలత,ఆశా వర్కర్ అధిలక్ష్మి పాల్గొన్నారు.



## బాలింగ్ సత్తయ్య మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపంలకి బియ్యం పంపిణీ.

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : వినాయక చవితి నవరాత్రులు భాగంగా శనివారం బాలింగ్ సత్తయ్య మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓల్డ్ హాఫిజ్ పెట్ 109 డివిజన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలకి బియ్యం పంపిణీ చేసిన హాఫిజ్ పెట్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్, బాబు, భాస్కర్, మల్లేష్, సాయి, రంజిత్, రాకేష్, శ్రీధర్, కళ్యాణి, నికిల్ పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో పోటీకి సిపిఎం శ్రేణులు సిద్ధం కావాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి



మిర్యాలగూడ ఆగస్టు 30:- ( వార్త మిర్రర్ ) స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఎం శ్రేణులు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి కోరారు. మిర్యాలగూడ మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో సిపిఎం సీనియర్ నాయకులు మైనం కిషన్ రావు 35వ వర్ధంతి సందర్భంగా సభ నిర్వహించారు. తొలుత స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ అమరవీరులు ఆశయ సాధన జరగాలంటే ప్రజా సమస్యల పరిష్కారం కోసం నడుం బిగించి కమ్యూనిస్టులు కొట్లాడాలన్నారు. అదే స్పూర్తితో రాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో సిపిఎం తరఫున పోటీ చేయడానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు.నాటి నుండి నేటి వరకు అనుక్షణం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటిని అధ్యయనం చేస్తూ సమస్య పరిష్కారం కోసం అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్న కమ్యూనిస్టులను ప్రజలు ఆదరించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలు కావస్తున్న రాజ్యాంగ ఫలాలు ఇంకా పేదలకు అందలేదని అది ముమ్మాటికి దేశాన్ని రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న పాలకుల వైఫల్యమని ఆ వైఫల్యం ఎండగట్టాడానికి కమ్యూనిస్టులకు ప్రజలు చేయుత అందించాలని వారు పిలుపునిచ్చారు. మైనం కిషన్ రావు హత్య గావించబడి 35 సంవత్సరాలు కావస్తున్న వారి ఆశయ సాధన కోసం ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే విధంగా పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని పదవులతో సంబంధం లేకుండా ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తు అన్ని వర్గాల ప్రజల హక్కులకై పోరాడుతున్నామని వారు తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు మండల కార్యదర్శి రవి, నాయక్ జిల్లా కమిటీ సభ్యులు చౌగాని సీతారాములు, మల్లు గౌతంరెడ్డి, మండల కమిటీ సభ్యులు చౌగాని వెంకన్న, శాఖ కార్యదర్శి గుండు నాగయ్య, మండల నాయకులు చినగాని సైదమ్మ, కందుకూరు రమేష్ బాబు జిల్లా నగేష్, చిరుమళ్ళ బిక్షం, నాగూర్ హుసేన్, కోటిరెడ్డి, సువార్త, లింగయ్య, సోమయ్య, బ్రాహ్మాచారి, రామేశ్వరచారి పాల్గొన్నారు.



## మిర్యాలగూడ నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

మిర్యాలగూడ ఆగస్టు 30:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అభివృద్ధిలో ఎన్నో సంవత్సరాలుగా వెనకబడి ఉంది నియోజకవర్గంలో శ్రామికులు , కార్మికులు, గిరిజలులు అధికంగా ఉన్నారని నియోజకవర్గం పై ప్రత్యేక దృష్టితో నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని కోరినట్టు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఎమ్మెల్యే కార్యాలయం నుండి జారీ అయినా ప్రకటనలో తెలిపారు. శనివారం హైదరాబాద్ లో ఉమ్మడి నల్లగొండ జిల్లా శాసనసభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి కి విన్నవించగా సావధానంగా విని హామీ ఇచ్చారని తెలిపారు.



## మన ధర్మాన్ని మనం కాపాడుకుందాము విశ్వ హిందూ పరిషత్

నారాయణపూర్ ఆగస్టు 30 (వార్త మిర్రర్ )మండల కమిటీ మరియు గ్రామ కమిటీ లోకి నూతన మెంబెర్స్ ని చేర్చుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో వి హెచ్ పి మండల అధ్యక్షులుఐతరాజు స్వామి మాట్లాడుతూమన హిందూ ధర్మాన్ని మరియు మన సనాతన ధర్మాన్ని నాశనము చేయడానికి చాలా దుష్ట శక్తులు తయారయ్యారని ముందుగా బ్రాహనుల మీద తరువాత కోమట్ల మీద ఇప్పుడు మార్వాడీ గో బ్యాక్ అని అంటున్నారు మన భారత దేశం లో ఉన్న ప్రజలు ఎవ్వరు ఎక్కడైనా బిజినెస్ చేసుకొని బర్తకవచ్చు తప్పు చేస్తే నీలాదీయాలి అంతే కానీ మన ధర్మాన్ని ఎవ్వరైతే పాటిస్తారో వారి మీదనే దాడి చేయడం జరుగుతుంది రోహింగ్యాలు మన దేశమ్ లోకి అక్రమంగా చొరబడినా లవ్ జీహాద్ లు ఎన్ని జరిగినా సప్పుడు చేయని వారు మన ధర్మం మీదనే ఏడుస్తారు ఇకనైనా ఇలాంటివి మానుకుని ఎవరిపని వారు చేసుకుంటే మంచిదాని చెప్పారు ఈ కార్యక్రమం లో మండల ఉపాధ్యక్షులు రాస మల్లముత్యాలు వి హెచ్ పి నారాయణపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు కిషోర్ హాజరు అయ్యారు ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల శాఖ కమిటీ సభ్యులు రాసామల్ల ముత్యాలు, పట్నం బాలకృష్ణ, చెదురుపల్లి సాయిచరణ్, లోకం వంశీ, గ్రామ శాఖ కమిటీ సభ్యులు నర్సింగ్, కిషోర్, మహేష్, అనిల్, మహేష్ పాల్గొన్నారు

## మొక్కజొన్న పచ్చి కంకులు అమ్మడానికి రైతుల ఆసక్తి..జోరుగా కొనుగోళ్లు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 30

సీజన్ కావడంతో జగిత్యాల మార్కెట్కు మొక్కజొన్న కంకులను రైతులు తీసుకొస్తున్నారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కజొన్న రైతులు పచ్చి కంకులనే అమ్ముకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ధర గిట్టుబాటు అవుతుండటంతో అమ్మకాలు, కొనుగోళ్లతో జగిత్యాల మార్కెట్ కళకళలాడుతోంది. జగిత్యాల వ్యవసాయ డివిజన్లో పత్తి, కంది, వరి మామిడి తరువాత మొక్కజొన్నను రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. కొంత మంది రైతులు చెరకులోనూ, పసుపు లోను అంతరపంటగా మొక్కజొన్న పండిస్తుంటారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది మొక్కజొన్న సాగు విస్తీర్ణం 75 శాతం వరకు పెరిగింది. జగిత్యాల, ధర్మపురి, మెట్టుపల్లి, కోరుట్ల,రాయికల్, మల్యాల, గొల్లపల్లి, వెల్కటూరు తదితర మండలాల్లో రైతులు గత సంవత్సరం వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ సంవత్సరం ఇంకా అధికంగా పంట సాగవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మొక్కజొన్నకు కేంద్రం కనీస మద్దతు ధర రూ. 2,360 ప్రకటించడం వల్ల గిట్టుబాటవుతుందని సాగుకు మొగ్గు చూపారు.మార్కెట్లో కొనుగోళ్లు..సీజన్ కావడంతో మార్కెట్ కు రైతులు పచ్చి కంకులను తీసుకొస్తున్నారు. వర్షాల కారణంగా మొక్కజొన్న కంకులను(బుట్టాలు) ఎండబెట్టడం శ్రమతో కూడుకున్న పని కారణంగా రైతులు పచ్చి కంకులనే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పట్టణంలోని వివిధ మార్కెట్ ల లో, రహదారుల వెంబడి అమ్ముతున్నారు. జగిత్యాల కు దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు వాహనాలను ఆపి కంకులను కొనుగోలు చేస్తున్నారు. గ్రామాలలో కూడా విక్రయిస్తున్నారు. మార్కెట్లో ప్రస్తుత ధర కిలోకు రూ.16 నుంచి 20 వరకు మరియు పలుకుతోంది. గిట్టుబాటు ధర లభిస్తుండటంతో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. చిరువ్యాపారులు కాల్చిన ఒక్కో కంకిని రూ. 20కు,పచ్చివి రూ. 50 కి 10కంకులు చొప్పున కూడా అమ్ముతున్నారు. **(తిరుమల శంకర్ రాయికల్ ప్రతినిధి)**



## ప్రత్యేక పూజలు మరియు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ హామీ పటేల్

కొండాపూర్ వార్త మిర్రర్ : వినాయక చతుర్థి నవరాత్రుల పండుగ సందర్భంగా, శనివారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీ ఏ బ్లాక్, గోపాల్ రెడ్డి నగర్, ఓయూ కాలనీ, రాజా రాజేశ్వరి నగర్ లోని పార్క్ అవెన్యూ కాలనీలలో పలు గణేష్ మండపాలకు కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ హాజరై, ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ గణనాథుడు ప్రజలందరినీ చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరు అనుకున్న పనిలో విజయం సాధించాలని, అందరికీ ఆ విఘ్నేశ్వరుని ఆశీర్వాదాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికి కూడా వినాయక చతుర్థి నవరాత్రుల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హమీద్ పటేల్ తో పాటుగా కొండాపూర్ డివిజన్ సీనియర్ నాయకులు జే. బలరాం యాదవ్, రమేష్ యాదవ్, టీ. వెంకటేష్, మొహ్మద్, నాగరాజు, అశోక్, శ్రీనివాస్, అవదీష్ నారాయణ, హనుమంత్ రెడ్డి, నరసింహ రెడ్డి, యాదిరెడ్డి, గడ్డం ప్రశాంత్, ప్రవీణ్, రిటైర్డ్ జడ్జి గోవింద్ రెడ్డి, రజనీకాంత్, శివారెడ్డి, శ్రీకాంత్, జీ. వెంకటేష్, భక్తులు, ప్రజలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వర్షాలతో దెబ్బతిన్న రోడ్డు కు మరమ్మతులు చేయించిన ఎమ్మెల్యే బత్తుల





మిర్యాలగూడ, ఆగస్టు 30:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గంలోని ఆధ్వాన్నంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న మిర్యాలగూడ -భీమారం - సూర్యాపేట రోడ్డుపై స్పందించిన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఎట్టకేలకు మరమ్మతులు చేయించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎంతో సమస్యగా ఉన్న మిర్యాలగూడ -భీమవరం- సూర్యాపేట రోడ్డు వర్షాకాలం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్ వెంటనే స్పందించి రోడ్డు మరమ్మత్తు పనులు చేయించారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## డాక్టర్ రాములు నాయక్ కు నివాళులర్పించిన ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ ఆగష్టు 30 వార్త మిర్రర్ :దేవరకొండ పట్టణానికి చెందిన సీనియర్ వైద్యుడు డాక్టర్ ఎన్.రాములు నాయక్ దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందించి,గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకొని దేవరకొండ పట్టణంలోని వారి ఆసుపత్రిలో రాములు నాయక్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళు లర్పించి, వారి కుటుంబ సభ్యులకు పరామర్శించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలో పేరొందిన ప్రముఖ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎన్నో సంవత్సరాల పాటు సుధీర్ఘ సేవలు అందించి కొన్ని వేల కుటుంబాలకు ఆపద్బాంధవుడుగా నిలిచారు అనిపవిత్రమైన వైద్య వృత్తినే దైవంగా భావించే మహెూన్నత వ్యక్తి,అందరితో స్నేహంగా ఉండి,సమాజంలో గౌరవమైన స్థానాన్ని సంపాదించుకున్న డాక్టర్ ఎన్ రాములు నాయక్ అని వారు తెలిపారు.

## అలరించినా వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు....



మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ లో ని శిల్పరామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం చెన్నై నుండి విచ్చేసిన కూచిపూడి నాట్య కళాకారుడు దిలీప్ తన ప్రదర్శనలో శివ స్తుతి, రాధికా కృష్ణ అష్టపది, ఆనంద తాండవం అంశాలను ప్రదర్శించి మెప్పించారు. మానస స్కూల్ అఫ్ డాన్స్ గురు కుమారి ప్రణవి తుమ్మాటి శిష్య బృందం కూచిపూడి ప్రదర్శనలో అంబపరకు, వినాయక కౌతం, గణేశా ప్చరత్నం, మూషిక వాహన, బ్రహ్మాంజలి, ముద్దుగారేయ్ యశోద, ఇదిగో భద్రాద్రి , ప్లేట్ పై నృత్యం, కుండపై నృత్యం , కృష్ణ శబ్దం అంశాలను రెయాన్స్, నాగ మానస, సహస్ర, పూర్వీక, సాయి అధ్య, గాయత్రీ, చక్రికా, హిమబిందు, దీపాంవిత, రిషిక మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



## కళ్యాణ మండప నిర్మాణానికి ఎంపీ నిధులు విడుదల

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 30జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలోని రామాలయ గుడికి అవసరమైన కళ్యాణ మండప నిర్మాణానికి నిజామాబాద్ ఎంపీ అరవింద్ మూడు లక్షల రూపాయల నిధుల విడుదల చేశారు. ఆలయ చైర్మన్ కోల రాజుకి ప్రెసిడెంట్ కాపీని బిజెపి మండల అధ్యక్షుడు ఆకుల మహేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లు అనుపురం సత్యం గౌడ్, బెజ్జంకి మోహన్, మాజీ ఉపసర్పంచ్ లు ఆర్మూరి నరేందర్, హరీష్ రావు, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని నరేందర్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వట్టిమల్ల శ్రీనివాస్, ఆలయ కమిటీ మెంబర్లు ఐలేని గంగారెడ్డి, గుజ్జుల మోహన్ రెడ్డి, కోల శంకర్, శేఖర్ రెడ్డి, భీమ రెడ్డి, నాయకులు పెళ్ళికొండ రవి, గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



# అన్నం పరబ్రహ్మ స్వరూపం

## చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ్‌కుమార్‌గౌడ్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగష్టు 30 : అన్ని దానాల కన్నా అన్నదానం చాలా గొప్పదని చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం రోజున చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమమును అన్నదాతలైన బత్తుల లక్ష్మయ్య - వరలక్ష్మీ దంపతులు,బత్తుల విప్లవ్ గౌడ్ - వాణి దంపతులు పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హిందూ పురాణాల ప్రకారం,దానాల్లో ఉత్తమమైన దానం అన్నదానమని పెద్దలు చెబుతారు. ఎందుకంటే ఒకపూట భోజనం పెట్టి ఆకలితో ఉన్న వారి కడుపు నింపొచ్చు. ఇలా ఇతరుల కడుపు నింపడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని చాలా మంది నమ్ముతారని ఈ సందర్భంగా తెలియజేశారు. గణపతి నవరాత్రుల సందర్భంగా అన్నదానం చేయడం నా పూర్వజన్మ సుకృతం అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై యాదగిరి గౌడ సంఘం నాయకులు ఇంతకీ మీ అంజయ్య గౌడ్ బత్తుల శ్రీశైలం గౌడ్ సుర్వి నరసింహ గౌడ్, మోగుదాల రమేష్ గౌడ్, బొంగు జంగయ్య గౌడ్, ఉప్మాగుల రమేష్ గౌడ్, ఉడుగు శ్రీనివాస్ గౌడ్, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, వర్కాల రవి గౌడ్, సంధదగళ్ల సతీష్ గౌడ్, ఉడుగు రమేష్ గౌడ్, ఉడుగు నరసింహ గౌడ్,చెరుకు లింగస్వామి గౌడ్, తొర్పునూరు రవి గౌడ్, తొర్పునూరి లింగస్వామి గౌడ్, మామిడి శివ, చెవగోని మహేష్ గౌడ్, కల్లెం నాగరాజు గౌడ్ అధిక సంఖ్యలో గౌడ కుల బాంధవులు, భక్తులు పాల్గొన్నారు..



## శ్రీరామ్ నగర్ ఎ బ్లాక్ లో బలరాం యాదవ్ ఆధ్వర్యం లో మహాఅన్నదానం..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో కొండాపూర్ శ్రీరామ్ నగర్ కాలనీ ఏ బ్లాక్ లో కొలువైన గణనాధుని వద్ద శనివారం రోజున మహా అన్నదానం కార్యక్రమం శ్రీరామ్ నగర్ కాలనీ మాజీ ప్రెసిడెంట్ , గల్లి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బలరాం యాదవ్. ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా 3000 మంది జన సమూహంతో అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ స్థానిక కార్పొరేటర్ అహ్మద్ పటేల్, సీనియర్ జర్నలిస్ట్ ఉప్పరి శేఖర్ సాగర్ లు హాజరయ్యారు.ఈ సందర్భంగా బలరాం యాదవ్ మాట్లాడుతూ.. అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి గల్లి గణేష్ ఉత్సవ కమిటీ తరపున పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు . ప్రతి ఏటా గల్లీ గణేష్. ఉత్సవ కమిటీ తరపున అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఆ గణేష్ మహారాజ్ ప్రతి ఒక్కరినీ చల్లగా చూడాలని అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు ప్రతి ఒక్కరికి ఇవ్వాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతున్ని కోరుకున్నట్లు తెలిపారు. మరొక్కసారి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో రాజమోహన్ రావు, రమేష్ యాదవ్,పి వెంకటేశ్వర్లు,జైపాలరెడ్డి ,రేపల్లె అశోక్, నాగరాజు యాదవ్ , శ్రీనివాస్, అవధిష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు



నేరడుగొమ్ము ఆగష్టు 30 వార్త మిర్రర్ : నేరడుగొమ్ము మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు నేరడుగొమ్ము ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కొర్ర శిరీష ఒక ప్రకటనలో తెలిపారు.శనివారం ఆమె మాట్లాడుతూ,6 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వరకు మిగిలిన సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆసక్తి గల విద్యార్థులు సర్టిఫికెట్లతో ఆదర్శ పాఠశాలలో తమను సంప్రదించాలని ఆమె సూచించారు.



# అఖండ 2లో శివసాక్షాత్కారం?

అగ్ర నటుడు బాలకృష్ణ కెరీర్‌లో 'అఖండ' సినిమా ఓ అద్భుతం. కోవిడ్ కారణంగా వెలవెలబోతున్న సినిమా థియేటర్లకు మళ్లీ జనకళను తెచ్చిన సినిమా అది. అందుకే.. బాలకృష్ణకు అభిమానులున్నట్టే.. 'అఖండ' సినిమాకు కూడా ప్రత్యేకంగా అభిమానులున్నారు. వచ్చే నెల 25న ఆ సినిమాకు సీక్వెల్‌గా 'అఖండ 2 –తాండవం' రానుంది. ఈ సినిమాపై అంచనాలు సాధారణంగా లేవ్. రీసెంట్‌గా విడుదలైన టీజర్ కూడా రికార్డు స్థాయి వ్యూస్‌ని సాధించింది. 'అఖండ 2' గురించి ఎలాంటి అప్‌డేట్ విడుదలైనా.. అది క్షణాల్లో వైరల్ అయిపోతున్నది. 'అఖండ 2' ప్రభావం ఆడియన్స్‌లో అలా ఉంది. తాజా ఈ సినిమాకు సంబంధించిన తాజా సమాచారం వెలుగు చూసింది. 'అఖండ' సినిమా విజయానికి ప్రధాన కారణం అమ్మ సెంటిమెంట్. దాన్ని సీక్వెల్‌లో మరింత గొప్పగా ఆవిష్కరించనున్నారట దర్శకుడు బోయపాటి శ్రీను. ఆ ఎపిసోడ్స్ కూడా చాలా బాగా వచ్చినట్టు చిత్రయూనిట్ చెబుతున్నది. వీటితోపాటు యాక్షన్ సీన్స్ కూడా 'అఖండ'ను మించే ఉంటాయట. ఇక అఖండ సికిందర్ అఘోరీగా ఇందులో బాలకృష్ణ మరోసారి నట విశ్వరూపం చూపించనున్నారని, 'అఖండ'ను మించి అత్యంత శక్తిమంతంగా ఇందులో ఆయన పాత్ర ఉంటుందని, సాక్షాత్ శివుడ్నే ఆ పాత్రలో జనం చూస్తారని మేకర్స్ చెబుతున్నారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆది, పగ్య జైస్వాల్, సంయుక్త మీనన్ కీలక పాత్రధారులు. తమన్ సంగీతం అందిస్తున్న విషయం విదితమే.

# 'మిరాయ్'లో భాగమైన కరణ్ జోహార్

'హను-మాన్'ఫేం తేజ సజ్జా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'మిరాయ్'. ఇందులో తేజ సజ్జా సూపర్ యోధాగా కనిపించనున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2డి, 3డి ఫార్మాట్‌లలో, ఎనిమిది భాషల్లో వచ్చే నెల 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.






# కూలీ, వార్ 2 చిత్రాలు చూడడానికి ముసుగు దొంగ మాదిరిన వెళ్లిన నాని..

ఈ వారం బాక్సాఫీస్ దగ్గర రెండు బడా చిత్రాలు పోటీ పడ్డ విషయం తెలిసిందే. స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలతో రజనీకాంత్, నాగార్జున నటించిన కూలీతో పాటు హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కాంబోలో రూపొందిన వార్ 2 చిత్రాలు ఆగస్ట్ 14న థియేటర్స్‌లో విడుదల అయ్యాయి. భారీ అంచనాల మధ్య 'వార్ 2' మరియు 'కూలీ' చిత్రాలు ఒకే రోజు విడుదల కావడంతో, అభిమానులు థియేటర్లకు పోటెత్తారు. ఈ సందడిలో కామన్ ఆడియన్స్‌తో పాటు పలువురు సినీ సెలబ్రిటీలు కూడా థియేటర్లలో సందడి చేశారు. న్యాచురల్ స్టార్ నాని ఈ రెండు సినిమాలను వీక్షించేందుకు హైదరాబాద్‌లోని ఏఎంబి థియేటర్‌కు వెళ్లారు. అయితే ఇక్కడ ఆసక్తికర విషయం ఏమిటంటే.. నాని పూర్తిగా మాస్క్‌తో ముఖాన్ని కప్పుకొని అక్కడికి వెళ్లాడు. తనని ఎవరు గుర్తు పట్టకూడదని ముఖాన్ని పూర్తిగా కవర్ చేసుకున్నాడు. తన కొత్త లుక్‌ను రివీల్ కాకుండా చూసేందుకు ఇలా మాస్క్ ధరించాడని ఫ్యాన్స్ చెబుతున్నారు. ప్రస్తుతం నానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రస్తుతం నాని.. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' అనే సినిమాలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన ఫస్ట్ లుక్ ఫ్యాన్స్‌లో భారీ అంచనాలు పెంచింది. ప్యారడైజ్ టీజర్, లుక్స్ చూస్తుంటే అభిమానులకు ఫ్యూజులు ఎగిరిపోతున్నాయి అని చెప్పాలి. గతంలో పక్కింటి కుర్రాడిలే కనిపించే నాని ఇప్పుడు వయోలెంట్‌గా మారి ప్రేక్షకులని సంభ్రమాశ్చర్యాలకి గురి చేస్తున్నాడు. తాజాగా విడుదలైన మేకింగ్ వీడియో సినిమాపై అంచనాలు మరింత పెంచేసింది. ప్యారడైజ్ లుక్స్, ఆ మేకింగ్ చూస్తుంటే నాని ఈ దెబ్బకు టైర్ 1 లిస్టులో చేరిపోయేలా కనిపిస్తున్నాడు. 200 కోట్లే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న నాని ఈ సినిమాతో ఏం చేస్తాడో చూడాలి. మూవీ మార్చ్ 26, 2026న విడుదల కానుంది.

# చిట్టిబాబు కథ కొనసాగితే!?



అన్నను చంపించిన ఎమ్మెల్యే చావు బతుకుల్లో ఉంటే.. అతన్ని హాస్పిటల్‌లో చేర్చి, సేవ చేసి, బతికించి, బతుకుపై ఆశ కలిగించి, చివరకు ఎందుకు చంపుతున్నానో వివరంగా చెప్పి మరీ చంపుతాడు 'రంగస్థలం' సినిమాలో హీరో చిట్టిబాబు. ఎమ్మెల్యేని గప్‌చుప్‌గా చంపేసి రామలక్ష్మితో ఎస్కేప్ అవ్వడంతో 'రంగస్థలం' కథ అప్పటికి ముగిసింది. మరి ఆ తర్వాత ఏం జరిగింది? ఎమ్మెల్యేని చంపిన చిట్టిబాబు జీవితం తర్వాత ఎలాంటి మలుపులు తీసుకుంది? ఈ ప్రశ్నలకు సమాధానం ఇప్పుడు తయారవుతోంది. అవును.. 'రంగస్థలం' సీక్వెల్‌ని సిద్ధం చేసేపనిలో నిమగ్నమయ్యారు దర్శకుడు సుకుమార్. ప్రస్తుతం రామ్‌చరణ్ 'పెద్ది' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతున్నది. శిష్యుడు సినిమా పూర్తవ్వగానే.. రామ్‌చరణ్ గురువుగారి సినిమా మొదలుపెడతారట. అంటే చిట్టిబాబునీ, రామలక్ష్మినీ 'రంగస్థలం' కొనసాగింపులో మళ్లీ చూడబోతున్నామన్నమాట. ఈ వార్తే నిజమైతే, ఇంతకు మించిన శుభవార్త మెగా అభిమానులకు మరొకటుండదు.

# థ్రిల్ పంచే ఘాటీ ప్రపంచం



'ఘాటీ' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమవుతున్నాడు తమిళ నటుడు విక్రమ్‌ప్రభు. అనుష్క ప్రధాన పాత్రలో క్రిష్ దర్శకత్వం వహించిన ఈ సినిమా సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శనివారం విక్రమ్‌ప్రభు పాత్రికేయులతో ముచ్చటించారు. దర్శకుడు క్రిష్ ఈ కథ చెప్పినప్పుడే చాలా ఎగ్జయిటింగ్‌గా అనిపించిందని, ఆయన క్రియేట్ చేసిన 'ఘాటీ' ప్రపంచం ప్రేక్షకులను థ్రిల్‌కి గురిచేస్తుందన్నారు. 'అనుష్కగారికి నేను పెద్ద అభిమానిని. గతంలో ఆమెతో కలిసి నటించే ఛాన్స్ మిస్సయింది. 'రుద్రమదేవి' చిత్రంలో అల్లు అర్జున్ చేసిన గోన గన్నారెడ్డి పాత్రకు తొలుత నన్నే అడిగారు. కానీ అప్పుడు కుదరలేదు' అన్నారు. 'ఘాటీ' చిత్రంలో తాను దేశిరాజు అనే పాత్రలో కనిపిస్తానని, ఉత్తరాంధ్ర నేపథ్యంలో నడిచే ఈ కథలో అక్కడి యాసలో మాట్లాడటం ఛాలెంజింగ్‌గా అనిపించిందని విక్రమ్ ప్రభు తెలిపారు. తెలుగులో తాను చిరంజీవి, నాగార్జునకు పెద్ద ఫ్యాన్‌నని, ఓ మంచి కథ ద్వారా తెలుగులో ఎంట్రీ ఇవ్వడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో తెలుగు చిత్రాలకు కూడా ప్రాధాన్యతనిస్తానని ఆయన పేర్కొన్నారు.

# యూట్యూబ్‌లో దూసుకుపోతున్న 'జిగ్రీస్' టీజర్

టాలీవుడ్ యువ నటులు కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా రామ్ నితిన్ (మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ ఫేమ్) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'జిగ్రీస్'. రోడ్ ట్రిప్ %-% ఫ్రెండ్షిప్ జానర్‌లో వస్తున్న ఈ సినిమాకు హరీశ్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తుండగా.. మౌంట్ మేరు పిక్చర్స్ పతాకంపై ఈ చిత్రాన్ని కృష్ణ వోడపల్లి నిర్మిస్తున్నాడు. వినయ్ కుమార్ చిటెం, కృష్ణ బురుగుల సహ-నిర్మాతలుగా ఉన్నారు. ఇటీవలే ఈ సినిమా టీజర్‌ను టాలీవుడ్ సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా విడుదల చేసిన విషయం తెలిసిందే. సందీప్ లాంటి స్టార్ దర్శకుడు ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయడంతో మూవీ టీజర్‌పై మంచి బజ్ ఏర్పడింది. అనుకున్నట్లుగానే ఈ సినిమా టీజర్ యూట్యూబ్‌లో వ్యూస్‌తో అదరగొడుతుంది. టీజర్ చూసిన ప్రేక్షకులు బాగుందని.. ఈ నగరానికి ఏమైంది, హుషార్ మ్యాడ్ వంటి సినిమాల వైబ్‌ని తీసుకువస్తుందని కామెంట్లు పెడుతున్నారు. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్ర టీజర్ అరుదైన రికార్డును అందుకుంది. ఈ టీజర్ వచ్చిన వారం రోజుల్లోనే 2.3 మిలియన్ వ్యూస్‌తో యూట్యూబ్‌లో రికార్డు సాధించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. నలుగురు స్నేహితులు ఇన్ టూ ది వైల్డ్ అనే ఒక ఇంగ్లీష్ సినిమా చూసి స్ఫూర్తి పొంది, ఫోన్లు, డబ్బులు, ఐడెంటిటీ కార్డులు లేకుండా గోవాకు ప్రయాణం మొదలుపెడతారు. ఆ ప్రయాణంలో వారికి ఎదురయ్యే సరదా, కష్టాల సమాహారమే ఈ చిత్రం. తెలంగాణ యాసలో చెప్పిన సంభాషణలు ఆకట్టుకుంటున్నాయి. ఈ మూవీకి సరైన ప్రచారం చేస్తే, 'ఈ నగరానికి ఏమైంది', 'హుషారు', మ్యాడ్ చిత్రాలవలే ఈ చిత్రం కూడా సూపర్ హిట్ కొడుతుందని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా ఈశ్వరదిత్యా పనిచేస్తున్నారు, కమ్రాన్ సయ్యద్ సంగీతం అందిస్తున్నారు. స్వప్నిక్ రావు సౌండ్ డిజైన్ చేయగా, శ్యామల్ సిక్దర్ మిక్సింగ్ బాధ్యతలు చూసుకున్నారు. చాణక్య రెడ్డి తూరుపు ఎడిటింగ్, నితీష్ మిశ్రా కలరింగ్ అందిస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్లుగా కిశోర్ చక్రవర్తి, ప్రసన్న రావు తోడేటి, శ్రీరామ్ వల్లభదాస్, దుర్గ ప్రసాద్ బొడ్డుపల్లి, ఆశ్రిత్, సాయి పనిచేస్తున్నారు. ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను వంశీ-శేఖర్ చూసుకుంటున్నారు, అనిల్-భాను పబ్లిసిటీ డిజైన్, బిగ్ ఫిష్ మీడియా డిజిటల్ ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు.



# జియో సిమ్ రాక ముందు..

'90 మిడిల్‌క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, శివానీ నాగరం జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'లిటిల్ హార్ట్స్'. సాయిమార్తాండ్ దర్శకుడు. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ పతాకంపై ఆదిత్యహాసన్ నిర్మించారు. నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. 'జియో సిమ్ రాకముందు జరిగిన కథంటూ ట్రైలర్ ఆసక్తికరంగా మొదలైంది.